www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231

తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :38 | 05-07-2021 | పుటలు : 4



వంద తుపాకీ గుళ్ళు దూసుకొస్తుంటే మొదట తన గుండెను వాటికి ఎదురొడ్డిన ఉత్తమ నాయకుడు... తన గురించి ఆలోచించనివాడు.. తన వారి కోసం ఏ మూల్యమైనా చెల్లించగలవాడు... తన శక్తి తెలిసినవాడు... ఎదుటి వాడి శక్తిని పట్టించుకోనివాడు... నేను ఒక్కడిని పోతే వందమంది పుడతారన్న స్పృహ ఉన్నవాడు... తన రక్తంతో ఉద్యమం అడవిని చిగురింపచేసినవాడు... అతడే... అల్లూరి సీతారామరాజు!!

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యం పొగరుని తన పాదాల దగ్గర మోకరిల్ల చేసినవాడు...

## అల్లూరి సీతారామరాజు!!


ఆ విప్లవాగ్ని జయంతి జూలై 4 (1897)

- నన్నయవాణి

# అంతర్జాతీయ పరిశోధనలకు ప్రణాళికలు

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**28.06.21 (మీడియాసెల్)** గోదావరి ప్రాంతంలోని సహజ వనరులను పూర్తిగా అధ్యయనం చేసి పరస్పర సహకారంతో అంతర్జాతీయ స్థాయి పరిశోధనలు జరిగే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో సోమవారం "కెపాసిటీ బిల్డింగ్ అండ్ ఇంటర్నేషనల్ నెట్ వర్కింగ్ కోసం అవకాశాలు" అనే అంశంపై ఆన్ లైన్ సమావేశాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చే విధంగా విశ్వవిద్యాలయం నుండి విలువైన పరిశోధనలు జరగాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలోని పరిశోధనలను మన విశ్వవిద్యాలయానికి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యా, విజ్ఞాన, పరిశోధన వంటి అంశాలపై పరస్పర సహకారాలు, సంబంధాలు ఉండటం ద్వారా విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలోని సముద్రం, గోదావరి, కొల్లేరు, కోరంగి, మడ అడవులు, దట్టమైన మన్య ప్రాంతాలు వంటి సహజ వనరులు ఉన్నాయని వీటిపై సమగ్రమైన అధ్యయనాలు చేస్తూ వాటి ప్రాముఖ్యాన్ని ఇతర ప్రాంతాలకు తెలియజేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రపంచంలోని ఆయా దేశాలలో ఉన్న ఇటువంటి సహజ వనరులు మన ప్రాంతంతో పొల్చుతు తులనాత్మక పరిశోధనలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇటివంటి పరస్పర బోధన, పరిశోధన జరిగే విధంగా విశ్వవిద్యాలయంలో "సెంటర్ ఫర్ మెరిన్ బయోలజీ రిసెర్చ్" ను ఏర్పాటు చేసేందుంకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఇన్సిట్యూట్ ఆఫ్ ఓషమోగ్రఫీ అండ్ ఎన్విరాన్మెంట్, యూనివర్సిటీ మలేషియా సహ ఆచార్యులు డా. బెహరా సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరస్పర సహకారాల ప్రణాళికలు, పరిశోధన అంశాలు, నిధులు సమకూర్చడం, అవగాహన ఒప్పందాలు వంటి పలు అంశాలను వివరించారు. మడ అడవులపై తాను చేస్తున్న పరిశోధన అంశాలను తెలియజేస్తూ ఆయా దేశాలలో ఉన్న పరిస్థితులను క్షుణంగా వివరించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి అంతర్జాతీయ సంబంధాలు, గుర్తింపు తీసుకువచ్చే విధంగా తన వంతు కృషి చేస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, విభాగాధ్యాపకులు డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.విజయనిర్మల డా.డి.కళ్యాణి, విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య వై.శ్రీనివాసరావు, ఆచార్య ఎస్.టేకి, డా.బి.జగన్మోహన్ రెడ్డి,డా.డి.జ్యోతిర్మయి, డా.వి.శర్మ, డా.రామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

# బయోలాజీ-కెమిస్ట్రీ సంబంధాలపై పరిశోధనలు పెరగాలి

### వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**03.07.21 (మీడియాసెల్)** జీవశాస్త్రం మరియు రసాయన శాస్త్రాల మధ్య అంతర్గత సంబంధాలపై మరిన్ని లోతైన పరిశోధనలు జరగాలని, నూతన విషయాలను వెలుగులోనికి తీసుకురావాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో "బయోలాజీ %--% కెమిస్ట్రీ ఇంటర్.ఫేస్ కొన్ని కేసుల అధ్యయనాలకు సంబంధించిన అంశాలపై పరిశోధనలు" పై నేషనల్ వెబినార్ ను నిర్వహించారు. యూనివర్సిటీ స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ డా.బి.జగన్మోహనరెడ్డి కన్వీనర్ గా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జీవ ప్రక్రియలలో రసాయన శాస్త్రం యొక్క పాత్ర కీలకంగా ఉంటుందని అన్నారు.

ఈ రెండింటి మధ్య సంబంధాలను శాస్త్రీయంగా అధ్యయనం చేస్తే ఎన్నో ప్రయోజనాలు ఉంటాయాని తెలిపారు. కెమిస్ట్రీ మరియు బయాలజీ యొక్క ఇంటర్ ఫేస్ లో బయోకెమిస్ట్రీ అత్యంత గుర్తింపు పొందిందని చెప్పారు. బయోలాజికల్ కెమిస్ట్రీ, కెమికల్ ఎకాలజీ, బయో ఆర్గానిక్ కెమిస్ట్రీ మరియు కెమికల్ బయాలజీ వంటి విభాగాలు వీటి సంబంధాలను తెలియజేస్తున్నాయన్నారు. పరమాణు గుర్తింపు మరియు సూపర్మోలెక్యులర్ కెమిస్ట్రీ అధ్యయనంలో అభివృద్ధి చెందిందని అన్నారు. వైద్య విద్య, ఫార్మ, కెమిస్ట్రీ విభాగాలలో వీటి సంబంధాలపై మరిన్ని అధ్యయనాలు జరగాలని చెప్పారు. జీవశాస్త్రం, రసాయనశాస్త్రాలలో పట్టు సాధించడం ద్వారా మెరుగైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని సూచించారు. కీలకోపన్యాసకులుగా హెూమి బాబా అటమిక్ నేషనల్ ఇన్సిట్యూట్ సైంటిస్ట్ డా.రజనీకాంత్ చిట్టెల మాట్లాడుతూ బయోలాజీ %--% కెమిస్ట్రీ ఇంటర్.ఫేస్ కు సంబంధించిన కొన్ని కేసు అధ్యయనాలను ఉదాహరణలతో వివరించారు. ప్రస్తుత కాలంలో కెమిస్ట్రీ %--% బయోలజీలలో జరుగుతున్న నూతన పరిశోధనలు,వాటి ఫలితాలను తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన బాబా అటమిక్ నేషనల్ ఇన్సిట్యూట్ లో సైంటిస్టు ఉద్యోగావకాశాలు ఏ విధంగా పొందవచ్చునో వివరించారు. దీనికి అవసరమైన జీవశాస్త్ర మరియు రసాయనశాస్త్ర మెలకువలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా.కె.వి.స్వామి, కన్వీనర్ డా.బి.జగన్మోహనరెడ్డి అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

# నన్నయలో అల్లూరి జయంతి



అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**04.07.21 (మీడియాసెల్)** మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ 'ప్రజల హక్కుల కోసం, స్వాతంత్ర్య పోరాటం కోసం బ్రిటీష్ సామ్రాజ్యమనే మహాశక్తిని ఢీకొన్న విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. తెలుగుజాతి తెగువకు నిలువెత్తు నిదర్శనమైన మన్యం వీరుడు అల్లూరి జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. తక్కువ కాలమే జీవించినా ఎక్కువ కాలం ఆయన రేపిన విప్లవ జ్వాలలు ప్రజల హృదయాల్లో నిలిచాయన్నారు. జాతీయోద్యమంలో అల్లూరి విప్లవాగ్నిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో డా.పి.వెంకటేశ్వరరావు, డా.ఎం.గోపాలకృష్ణ మరియు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం



## విప్లవాగ్ని

నది, సాగరము అనేవి రెండు వేర్వేరు అంశాలు కావు,రెండూ ఒకటే అంటారు ఖలీల్ జిబ్రాన్. నిబద్ధతగల విప్లవకారులకు చావూ, బ్రతుకు రెండు వేరు కాదు, ఒకటే! నీ నివాస ప్రాంతాన్ని ప్రేమించు అదే నీ దేశభక్తికి దారి అన్నారు కిమ్ జోంగ్గియెన్ అనే ఉత్తర కొరియా నేత. సీతారామరాజు చేసినదదే. తెల్ల దొరల దమననీతిని వ్యతిరేకించి మన్యసీమలో తూర్పుకొండ అగుపరచిన ఆకుపచ్చ సూర్యోదయం!!

ఆయన రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో మార్పు తేవటమే కాదు,విప్లవం... సంస్కృతిలో, భావాల్లో కూడా మార్పు తెస్తుంది. భారతదేశ స్వాతంత్ర సమరంలో అటువంటి మొదటి విప్లవకారుడు అల్లూరి సీతారామరాజు. భారతదేశ చరిత్ర పుటల్లో ఆయనది గ్లోరియస్ రివల్యూషన్. గిరిజనాభ్యుదయ

విప్లవార్కుడాయన. కొండలలో ఆవరించుకొని ఉన్న చిమ్మచీకటిలో చిరుకాంతి. మన్యం ప్రజల పట్ల సీతారామరాజుకి కలిగిన దయామయి భావన, అతనికి గల సేవాసంభావన ఇవే ఆయనకి ప్రచోదన!


ఆయన జీవనశైలి యోగం!విప్లవం ఆయనకి దైవ నియోగం!! విప్లవం అంటే మార్పు. విప్లవం అంటే క్రాంతి.

జాతస్య మరణం ధృవమ్! కానీ...జాతి కోసం మరణం అజరామరం! పారతంత్ర్యాపతితమైన ఉన్న భరతజాతిని ఉద్ధరించడానికి నడుం కట్టిన మహనీయులలో ఆయన తొలి విప్లవ కిరణం. ప్రభుత్వాన్ని ధిక్కరించి దేశ ప్రజల బాగుకోసం దేశ సేవా దృక్పథంతో తీవ్ర ధ్వనితో, దీర్ఘ స్మృతిలో విప్లవ శంఖం వినిపించిన ఆత్మత్యాగైకశీలి అల్లూరి సీతారామరాజు.

సీతారామ రాజు ఒక విప్లవం. ఒక నమ్మకం. ఒక చరిత్ర. అటువంటి వీరునికి మరణం లేదు. విప్లవానికి అంతంలేదు. ఎందరో జన్మిస్తారు. అందరూ మరణిస్తారు. కానీ కొందరే కారణజన్ములౌతారు.

సీతారామరాజు పుస్తకాల్లోనో, అక్షరాల్లోనో లేడు. జాతి గుండెల్లో శాశ్వతంగా ఉన్నాడు. దేశభక్తితో నిండిన గుండెల్ని ఒకసారి తట్టి చూడండి... సీతారామరాజు కనిపిస్తాడు.

## మంచి మాట



ఎంతకాలం జీవించామనేది కాదు. ఎంత గౌరవంగా, ఎంత సంతోషంగా, ఎంత సంతృప్తిగా జీవించామనేదే ప్రధానమైంది.

# పి.ఈ.టి. సత్యనారాయణకు వీసీ అభినందనలు

**03.07.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో మూడు సంవత్సరాలు విధులు నిర్వహించిన పి.సత్యనారాయణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాధరావు సత్యనారాయణను అభినందించారు. సత్యనారాయణ డిఎస్సి పరీక్ష ఫలితాల్లో (2018)అర్హత సాధించారు. తూర్పుగోదావరి జిల్లా గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ గా ప్రభుత్వ ఉద్యోగం లో చేరారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ లో నైపుణ్యత, సెట్, నెట్ పరీక్షలలో అర్హత సాధించడంతోపాటు డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణులైనందుకు విశ్వవిద్యాలయ అధికారులు మరియు విభాగ అధ్యాపకులు శుభాకాంక్షలు తెలియజేశారు.



సత్యనారాయణ అభినందిస్తున్న వీసీ

# యాకోబుకు ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు

**03.07.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ లో లైబ్రరీ అసిస్టెంట్ గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన కె.యాకోబును వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అభినందించి శుభాకాంక్షలను తెలియజేశారు. కాకినాడ క్యాంపస్ లో యాకోబు పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ప్రత్యేక అధికారి డా.కమల కుమారి మరియు ప్రాంగణ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది యాకోబుకు శుభాకాంక్షలు తెలియజేశారు. 2000 సంవత్సరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ గా ఉద్యోగాన్ని ప్రారంభించి లైబ్రరీ అసిస్టెంట్ గా పదోన్నతిని పొంది 21 సంవత్సరాల పాటు త్రికరణ శుద్ధితో విధులను నిర్వహించారని, వారి సేవలు అమూల్యమైనవని విశ్వవిద్యాలయ అధికారులు పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వారు కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.




యాకోబు కు జ్ఞాపికను అందించి అభినందిస్తున్న వీసీ



యాకోబు సన్మానిస్తున్న క్యాంపస్ అధికారులు

# పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం

**03.07.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లతోపాటు గోదావరి జిల్లాలోని అనుబంధ కళాశాలలో పరీక్షల నిర్వహణ పై విశ్వవిద్యాలయ అధికారులు సమీక్షా,చర్చలను నిర్వహించారు. బుధవారం ఆన్లైన్ లో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి విశ్వవిద్యాలయ అధికారులు అందరూ పాల్గొని పరీక్షల నిర్వహణపై తమ తమ అభిప్రాయాలను తెలియజేశారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో పరీక్షలను ఏ విధంగా నిర్వహించాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. డిగ్రీ మరియు పీజీ విద్యార్థులందరికీ ఇప్పటికే పాఠ్యాంశాలు ఆన్లైన్ ద్వారా పూర్తి చేశామని కళాశాలల ప్రిన్సిపాల్స్ మరియు అధికారులు తెలియజేశారు. కోవిడ్ మొదటి దశలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య పరీక్షలు నిర్వహించిన విధివిధానాలను పరిశీలించారు. కోవిడ్ ను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షల నిర్వహణపై త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని వీసీ తెలియజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

# ఉన్నత విద్యారంగ ప్రగతిరథ సారథి డా.వైయస్



**నన్నయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు**
**డా.వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి.**
**జూలై 8**

**రాజువయ్యా!...మహ రాజువయ్యా!!**

**డా.వైయస్** రాజశేఖర్ రెడ్డి వ్యక్తిగతంగా ఉన్నత విద్యావంతుడు కావడం, 1982-83 లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన అనుభవంతో ఉమ్మడిరాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఉన్నత విద్యారంగం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఉన్నత విద్యారంగం ప్రగతికి ఆయన తీసుకున్న నిర్ణయాలు సాహసోపేతమైనవి. జిల్లాకు ఒక విశ్వవిద్యాలయం, ఫీజు రియంబర్స్మెంట్, బోధన సిబ్బంది నియామకాలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ డా.కొణిజేటి రోశయ్య అసెంబ్లీలో డా.రాజశేఖర్ రెడ్డి పై సంతాప తీర్మానం ప్రవేశ పెడుతూ "ఒకే ఒక్క కలంపోటుతో రాష్ట్రంలో 14 విశ్వవిద్యాలయాలను ఏర్పాటుచేస్తూ తీసుకున్న నిర్ణయం దేశచరిత్రలోనే ఒక చారిత్రాత్మక ఘట్టం"గా అభివర్ణించారు. రాష్ట్రంలో ఉన్న పెద్ద విశ్వవిద్యాలయాలలో రోజు రోజుకి భారంగా మారుతున్నా పరీక్షల నిర్వహణ, అనుబంధ కళాశాలలపై అజమాయిషీ లోపించడం, పరీక్షా ఫలితాల వెల్లడిలో జాప్యం, బోధన సిబ్బంది తగినంతగా లేకపోవడం, విద్యా ప్రమాణాలు నానాటికీ కుంటుపడటం వంటి కారణాలతో ఉన్నత విద్యా రంగ ప్రగతి క్షీణించడం గమనించిన డా.రాజశేఖర్ రెడ్డి ఉన్నత విద్య ప్రక్షాళన మరియు వికేంద్రీకరణకు నడుంబిగించారు. దానితో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పటికీ కేవలం 14 విశ్వవిద్యాలయాలు మాత్రమే ఉన్నాయి. జిల్లాకు ఒక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయ సంకల్పించి 14 వర్సిటీలను స్థాపించి ఉన్నత విద్యారంగాన్ని ఆధునీకరించిన మహనీయుడు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి. హైదరాబాద్ జె.ఎన్.టి.యు. విశ్వవిద్యాలయం క్యాంపస్ కళాశాలలైన జెఎన్టియు- కాకినాడ, జె.ఎన్.టి.యు- అనంతపురం కేంద్రాలను విశ్వవిద్యాలయాలుగా మార్చడం, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఉద్యాన వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని, బాసర, పులివెందుల మరియు నూజివీడులలో రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) వంటి ట్రిపుల్ ఐటీ, విశాఖపట్నంలో దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయాన్ని మరియు రాష్ట్ర వ్యాప్తంగా 10 విశ్వవిద్యాలయాలను స్థాపించి అభివృద్ధిబాట పట్టించిన ఘనత డా.రాజశేఖర్ రెడ్డి కే దక్కుతుంది. అనేక బాలారిష్టాలను అధిగమించి నేడు ఆయా విశ్వవిద్యాలయాలు మౌలిక వసతులు సమకూర్చుకుని దిగ్విజయంగా పనిచేస్తున్నాయి. బోధన రంగంలో రాజశేఖర్ రెడ్డి హయాంలోనే శాశ్వత ప్రాతిపదికన ఆచార్యులు, సహ మరియు సహాయ ఆచార్యుల పోస్టులను భర్తీ చేసి, విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి విశేష కృషి చేశారు. ఆయన తర్వాత పనిచేసిన ఏ ముఖ్యమంత్రి వర్సిటీలలో ఇప్పటివరకు శాశ్వత బోధన సిబ్బందిని నియమించకపోవడం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వేలాది కుటుంబాలు బోధన, బోధనేతర రంగాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకున్నారు. ఈరోజు ఎంతోమంది ఆయా విశ్వవిద్యాలయాలలో సేవలు అందిస్తున్నారంటే దానికి ఒకే ఒక కారణం రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని దూరదృష్టితో ఆయన తీసుకున్న నిర్ణయమే. స్వతహాగా వైద్యుడు కావడం కేవలం విద్యారంగంలో వైద్య విద్యా రంగంలో కూడా తనదైన ముద్రను వేశారని చెప్పవచ్చు. కడపలో రాజీవ్ గాంధీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ను కేవలం పద్నాలుగు నెలల్లోనే నిర్మించి చరిత్ర సృష్టించారు.ఆయన స్థాపించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నేడు రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయంగా 450 పైబడి అనుబంధ కళాశాలలు కలిగి సుమారు లక్ష మందికి పైగా విద్యార్థులతో అభివృద్ధి చెంది విరాజిల్లుతోంది.ఆయన తనయుడు నేటి మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యం, సహకారంతో ఉపకులపతి వర్యులు ఆచార్య మొక్కా జగన్నాథ రావు విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి పథంలోకి నడిపించడం హర్షణీయం. బోధన, పరిశోధన రంగాలలో ఆచార్యుల ప్రగతిని నిత్యం పర్యవేక్షిస్తూ విద్యా ప్రమాణాల పెరుగుదలకు ఉపకులపతి కృషి చేస్తూ ఉండటం ఆ మహనీయుని ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లటమే. ఉన్నత విద్యారంగంలో రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన మరో సాహసోపేతమైన పథకం ఫీజు రీఎంబర్స్మెంట్. రాష్ట్రంలోనే కాక దేశ చరిత్రలోనే ప్లస్ టు పైబడిన విద్యార్థులందరికీ ఈ పథకాన్ని అమలు చేశారు. ఆర్థిక భారంతో ఉన్నత చదువులకు దూరమవుతున్న లక్షలాది మంది విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ పథకం ద్వారా తండ్రిగా నేనున్నాను అంటూ భరోసా అందించి పట్టాలు అందించిన ఘనత డా. రాజశేఖర్ రెడ్డికే దక్కుతుంది. కళాశాలలో చేరి ఫీజు చెల్లించలేక మధ్యలోనే విద్యాభ్యాసం ముగించే వారికి ఫీజు రీయింబర్స్మెంట్ పథకం పునరాభ్యాసానికి ఒక సంజీవినిలా తోడ్పడింది. కేవలం ఎస్సీ,ఎస్టీ,బిసి, మైనారిటీ, వికలాంగ విద్యార్థులకే కాకుండా సుమారు ఏడు లక్షల మంది ఆర్థికంగా వెనుకబడిన ఈ.బీ.సీ విద్యార్థులకు కూడా మొట్టమొదటిసారి రాష్ట్ర చరిత్రలో 100% రియంబర్స్మెంట్ వర్తింపజేసిన ఘనత డా. రాజశేఖర్ రెడ్డికి చెల్లుతుంది. అప్పట్లో ఈ పథకం ద్వారా 2009 వరకు సుమారు 26 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందడం విశేషం. విశ్వవిద్యాలయాల స్థాపన, బోధన, బోధనేతర సిబ్బంది నియామకం, మౌలిక వసతుల కల్పన ఫీజు రీయింబర్స్మెంట్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు విద్యావకాశాలు తద్వారా ఉన్నత విద్యా రంగాన్ని ప్రగతి రథ చక్రాలపై ఎక్కించిన రథసారథి డా.వైయస్ రాజశేఖర రెడ్డి.

**(ఆయన జయంతి సందర్భంగా సమర్పిస్తున్న అక్షర నీరాజనం)**

- డా. జోసెఫ్ స్టీఫెన్ కొమ్మర,

సహాయాచార్య,రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం,ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్యాంపస్ కాకినాడ.

## మా చదువుల దేవుడు

ఏలాంటి మచ్చలేని మహా మనీషి
మా రాయలసీమ శ్రీరాజశేఖరరెడ్డి
ప్రజలందరు తెగ మెచ్చిన నచ్చిన
మెరిసే విరిసే మా బంగారపు కడ్డి !
మనం ఎరిగిన మంచి మనిషి
మన మనసెరిగిన మహామనీషి
జలయజ్ఞం అందించిన ప్రదాత
జనులందరి హృదయాధినేత!
మధ్యజనులనాడి పసిగట్టినవాడు
విద్యయొక్కవిలువ గుర్తించిన రేడు
విద్యాలయాల నిర్మించిన ఘనుడు
విద్యార్థులమదిలో మెరిసే ఇనుడు!
పిల్లలందరికీ ఉచిత విద్య నందించి
చిల్లెరమల్లెర ఫీజుల తానే భరించి
మార్గ దర్శకుడైన మహానుభావుడా!
వారి మదిలో జీవించిన మాదేవుడా!!
విద్యావిపినిధాటికి నీవు తట్టుకొని
విద్యార్థులందరిని వెంటబెట్టుకొని
ప్రవేటు బడులను చేసావులే
కట్టడి,ఆటుపోటులతట్టుకొనినీవీముట్టడి!!
పిల్లలందరినీ పల్లెల్లో బడికి పంపి
జ్ఞానామృతాన్ని వారికి నీ వొంపి
సరస్వతి పుత్రులుగా మార్చావు
సారస్వత లోటును నీవు తీర్చావు
విద్యార్థులకు దారి చూపిన వాడవు
వారికివెన్నుదన్నగ నిలిచిన నీడవు
చదువుల కరువు తీర్చిన దేవుడవు
పదవులబరువుమోసిన భానుడవు
ప్రాథమిక పాఠశాలలు కట్టించారు
పుస్తక భాండాగారములను పెట్టించారు
చదువుల దీపాలను వెలిగించారు
పదవుల పాపాలను తొలిగించారు
చదువులనందించిన మా చదువుల దేవుడవు
మమ్ముల దీవించిన మా మహానుభావుడవు
మా వేలవేల దండాలు అందుకో నీవయ్యా
మా గుండెల్లోన కొలువైన నిలిచిపో నీవయ్యా!

- గుర్రాల లక్ష్మారెడ్డి కల్వకుర్తి.
నాగర్ కర్నూల్ జిల్లా.

## ప్రతిక్షణం ప్రజల గుండెల్లో నీ స్థానం పదిలం రాజశేఖరా!

ఆరోగ్యశ్రీతో ఆయుష నింపి,108 తో ఆపద్బంధువుడవయ్యావు ..
జలయజ్ఞంతో అపర భగీరథుడవయ్యావు..
రైతుల కోసం వ్యవ'సాయం' చేశావు..
ఫీజు రీయంబర్స్ మెంట్ తో విద్యాజ్యోతులు వెలిగించావు..
ఇళ్లు ఇచ్చి..కన్నీళ్లు తుడిచావు
ఫించనులు ఇచ్చి.. అవ్వతాతలకు ఆధారమయ్యావు..
అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఆసరాగా నిలిచావు..
రాజకీయ నాయకుడిలా కాదు.. రాముడిలాగా పాలించావు.
విశ్వసనీయతను నీఇంటి పేరుగా మార్చుకున్నావు.
అందుకే.. ఇంకో వందేళ్లయినా నిన్ను మరువదు ఈ ప్రజానీకం.

- బి.సుశాంత్ కుమార్,బి.ఎడ్.అక్కు.

## వైయస్సార్ విద్యాప్రగతి



పూర్వంచదువంటే చదువే!
గురువులు నేర్పటం!
శిష్యులు నేర్చుకోవటం!
ధనంతోపనేలేదానాడు!
నేడుచదవాలంటే ధనం
అదే అందరికీ ఇంధనం!
పేదవిద్యార్థులు
పైచదువులకుదూరంనాడు!
నేడందరూచదువులకు
ముందుకొస్తున్నారంటే !
వైయస్సార్ విద్యాదీవెన!
అదే ఎందరికో శ్రీరామరక్ష!
కళాశాలలో చేరితేచాలు!
ధనం సంగతి ప్రభుత్వం
చూసుకుంటుందిముఖ్యంగా!
విద్యార్థుల ఖాతాల్లోకి జమ!
తల్లుల ఖాతాల్లోకి జమ!
విద్యార్థుల కళ్లల్లో వెలుగులు!
అదేవారిజీవనరేఖలు!
అదేవైయస్సార్ విద్యాదీవెన!

- మల్లాదిసోమేశ్వరశర్మ,
విశాఖపట్నం.

## జోహార్ ... వైయస్సార్!!




స్వతహాగా ఆయనొక వైద్యుడు.
స్వభావరీత్యా సౌమ్యుడు. రాయలసీమ
పౌరుషం ఉన్నోడు.
ప్రజాసేవకు అంకితమయ్యాడు.
రాజకీయరంగంలో ఎదురైన ఆటుపోట్లను
అధిగమిస్తూ...
పాదయాత్ర ద్వారా ప్రజాభిమానాన్ని
పొంది..
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి
ముఖ్యమంత్రయ్యాడు మన వైఎస్ఆర్ ..
ఈ తరుణంలో....
ప్రత్యర్థులు కుట్రపన్నారో..
కాలమే కబలించిందో ఏమో గాని ...
ఎవరూ ఊహించని ప్రమాదానికి లోనై
మానవ లోకాన్ని వదిలి
అమర లోకానికి వెళ్ళిపోయారు
అయినాగానీ నేటికీ...
ప్రజల హృదయాలలో చిరంజీవిగానే ఉన్నారు మన వైయస్సార్
ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని 'ఆరోగ్యశ్రీ'
పేదింటి బిడ్డలకు ఉన్నత విద్యనుందించాలని 'ఫీజు రీయింబర్స్మెంట్'
ప్రమాదాల బారిన పడిన వారి ప్రాణాలు కాపాడాలని '108'
గ్రామీణ స్థాయిలో ఉచిత వైద్య సేవలకు '104'
వ్యవసాయ రంగానికి 'ఉచిత విద్యుత్'
ఇలా ఎన్నో ప్రజారంజకమైన పథకాలను అందించి
దేశానికే ఆదర్శమయ్యారు మన వైఎస్ఆర్..
ఉభయ గోదావరి జిల్లా వాసులకు కోసం 'ఆదికవి నన్నయ'
రాయలసీమ వాసుల కోసం 'యోగివేమన'
తెలంగాణ బిడ్డల కోసం 'శాతవాహన' యూనివర్సిటీలను ఏకకాలంలో మంజూరు
చేసి
విద్యాదాతగా చెరగని, చెదరని ముద్ర వేసుకున్న ఓ..
రాజశేఖరా!నీకివేమా జోహార్లు!!

- గంధం మాచరవెంకటరమణ,
రాజానగరం.

# కవితా కాలం

## చదువుకి ప్రోత్సాహం

పాలకుల వ్యక్తిగత అభిప్రాయాలు
పరిపాలనపై పడి వన్నెతెచ్చేవి
కొన్ని అందులో భాగమే వైయస్సార్ విద్యా ప్రగతి
విద్య వలన వ్యక్తి సమూహం
ప్రాంతం అమలు చేయించే నాయకులకు
పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది
అమలు చేయించే నాయకులకు తెలుసు
వ్యక్తీ,పదవీ కాదు ముఖ్యమని
పేరుప్రఖ్యాతులు శాశ్వతమని
అందుకే మంచి ఆలోచన మనసున్న మారాజు వంటి
ముఖ్యమంత్రికే చెల్లుబాటు
విద్య నేర్చుకునేందుకు అవసరమగు సాధనాసామగ్రి
సమకూర్చి
విద్యార్థులను ప్రగతి పథంలో ముందుకు నడిపించే
బాధ్యత
ఇంటిని ఊరిని జిల్లాని రాష్ట్రాన్ని
సంక్షేమం పేరుతో సురక్షితంగా
తీర్చిదిద్దిన ఘనత సాధించిన
నాయకులకు పేరు పేరునా ధన్యవాదాలు
జయహో! వైఎస్ఆర్ విద్యాప్రగతి!!

**- ఖండాపు మన్మథరావు, విజయవాడ.**

## విద్యా స్ఫూర్తి వై.ఎస్.ఆర్

"ప్రపంచాన్ని మార్చగల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య మాత్రమే "
– నెల్సన్ మండేలా.

ఈ మాటలే స్ఫూర్తిగా తీసుకుని ఒక వ్యక్తి పేద ప్రజలకు ఉన్నత విద్య అందించారు. ప్రతి పౌరుడిని విలువైన మానవ వనరుగా భావించారు. ఆయనే వై.ఎస్ రాజశేఖరరెడ్డి.

ఉన్నత విద్య అనేది అందుకోగలిగేవారికే కాదు ప్రతి ఒక్కరికి ప్రతి పౌరుడికి అందుబాటులో ఉండాలని అలావున్నప్పుడే సమాజంలో అసమానత్వం తొలగి సమానత్వం ఏర్పడుతుందని విశ్వసించి, అవరోధాలను అధిగమించి, కొత్త ఉన్నత చదువుల దిశగా పేద విద్యార్థులను నడిపించారు డా. వై.ఎస్.ఆర్.

"విశ్వ విద్యాలయాలు ప్రాపంచిక జ్ఞానం అందించే పాఠశాలలు "అని న్యూమాన్స్ ఐడియా అఫ్ యూనివర్సిటీ అనే గ్రంధములో మనం చూడవచ్చు.

అటువంటి ఉన్నత విద్యను బోధించే, ప్రాపంచిక జ్ఞానం అందించే విశ్వవిద్యాలయాల ప్రాంగణంలోకి బడుగు బలహీనవర్గాల పేద విద్యార్థులు ప్రవేశించాలని, అంతమాత్రమే కాదు అవి వారికి అందుబాటులో ఉండాలని వై.ఎస్. ఆర్ బలంగా భావించారు.

పౌరులకు ఉన్నత విద్యకు వెచ్చించాల్సిన నిధులు భారీగా ఉండటంతో , ఆ భారాన్ని వదిలించుకోవడానికి ప్రభుత్వాలు ప్రవేటు విశ్వవిద్యాలయాలను ప్రోత్సహిస్తున్న తరుణంలో వై. ఎస్ మాత్రం లక్షల్లో ఫీజులు కట్టుకోలేక విద్యకు పేద విద్యార్థులు దూరమవుతున్నారని గ్రహించి , ప్రవేటు వర్సిటీలకు దీటుగా ప్రభుత్వ వర్సిటీలు జిల్లాకు ఒక్కటి ఏర్పరచి ప్రభుత్వ ఉన్నత విద్య విప్లవాన్ని తీసుకొచ్చారు.

"విప్లవమంటే పాతవ్యవస్థను సమూలంగా మారుస్తూ నూతన వ్యవస్థను నిర్మించడం"



విద్యావ్యవస్థపై వై. ఎస్ తనకున్న దార్శనికతను వాస్తవికతలోనికి తీసుకొచ్చారు. పౌరుల్లో వ్యక్తి వికాసాన్ని పెంపొందించే, విజ్ఞానాన్ని అందించే అత్యున్నత స్థాయి విశ్వవిద్యాలయాలను నిర్మించి విద్యాభివృద్ధికి, విద్యాప్రగతికి ఎనలేని కృషి చేశారు.


వాటిలో
ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం (రాజమండ్రి ),
యోగి వేమన వర్సిటీ (కడప),
అంబేద్కర్ వర్సిటీ (శ్రీకాకుళం)
కృష్ణ వర్సిటీ (మచిలీపట్నం) రాయలసీమ వర్శిటీ (కర్నూల్)
వై.ఎస్.ఆర్ ఉద్యాన వర్శిటీ (పశ్చిమగోదావరి)

ఈ విధంగా అనేక విశ్వవిద్యాలయాలను ఆయన ఏర్పరిచారు. సాంకేతిక విద్య అందించే లక్ష్యంతో ట్రిపుల్ ఐటి లను ఏర్పరిచారు.

చదువుకోవాలనే తపన వుండి, చదువుకునే స్థోమత లేని లక్షలాది మంది విద్యార్థుల కోసం ఫీ రేయింబర్సమెంట్ పథకాన్ని తెచ్చి ప్రతి పౌరుడికి విద్య అందించి, వారు ఉన్నత స్థితికి చేరుకోవాలని కాంక్షించారు.


అందుకే, వై.ఎస్. ఆర్ ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రానికి, దేశానికి ఒక నిలువెత్తు కీర్తి. విద్యార్థులకు మర్చిపోలేని ఒక స్ఫూర్తి.

**- కురమా సంపత్ కుమార్**
**లెక్చరర్,రాజనీతిశాస్త్రం**
**కొండవీటి డిగ్రీ కళాశాల**



చిత్రం : కొప్పుల వాగ్దేవి

చిత్రం:
**కొల్లాటి బిందు,**
**మహిళా కళాశాల,**
**నరసాపురం.**



## వాన వెలిసింది...



వర్ష ఋతువు... ప్రకృతి తన చెంగు చివర ముడిలో మనిషి కోసం దాచిపెట్టిన తాయిలంలా అనిపిస్తుంది. వాకిలికి కళ్ళాపి లాగా, భూమికి వర్షమేమో? ఎన్ని జ్ఞాపకాలో ఈ వర్షంతో! వర్షాన్ని చూడగానే సంవత్సరాల సంచుల్లోంచి, ఆలోచనల పెట్టెల్లోంచి జలజలా జారుతూ ఉంటాయి జ్ఞాపకాలు...

చిన్నపుడు వర్షంలో తడిసి ఇంటికొచ్చినపుడు అమ్మ తిడుతుందని ఎంత భయమో! అనుకున్నట్టే తిట్టేది, తిడుతూ తల తుడిచేది అమ్మ.. అర్థమయ్యేది కాదు, ఎందుకు అమ్మ పిచ్చిదానిలా ఒక పక్క తిడుతూ ఇంకోపక్క తల తుడుస్తుందని. అనుకునేలోపే బయటనుంచి పెద్ద ఉరుము శబ్దం వినిపించేది! ఆకాశం కూడా అమ్మలానే అరుస్తుంది అనుకునేదాన్ని. ఒకపక్క అరుస్తూనే, మరోపక్క చినుకుల సడితో రాత్రంతా జోల పాడి నిద్రపుచ్చేది వర్షం. అచ్చం అమ్మలాగే!

మర్నాడు స్కూల్ మానేయడానికి మంచి కారణం ఉందని ఆనందం... వానలో తడిసి , ఆరని స్కూల్ యూనిఫామ్. అమ్మ అంటే ఏమనుకున్నారు? రాక్షసుడి చేతిలో ఆయుధంలా, అమ్మ చేతిలో ఇస్త్రీ పెట్టె!! చేసేదేముంది? తడిగా ఉన్న యూనిఫామ్ ని ఇస్త్రీ చేసి సిద్ధంచేసి స్కూల్ కి పంపేది... అప్పటిదాకా ఎండ, ఇలా స్కూల్లో అడుగుపెట్టగానే వర్షం!! దొంగ వర్షం... దోబూచులాడుతుంది. ఇదేదో ఇంట్లో ఉండగానే కురిసి ఉంటే చక్కగా స్కూల్ మానిపించేవాళ్ళమని అనుకుంటుంటే, కొంటెగా చూస్తూ కళ్ళెగరేసేది వాన. అలిగిన నాపై తన జల్లుని నిలిపి, మళ్ళీ ఇట్టే మాట కలిపేలా చేసేది వర్షం..

ఒక సంవత్సరం ఇలానే ఒక సాయంత్రం వర్షం జోరున కురుస్తోంది! పిల్లలమంతా కలిసి వర్షపు నీటిలో కాగితపు పడవలు వదులుతున్నాం. అపుడే వచ్చింది ఆ వార్త! వర్షానికి నది పొంగి ప్రవహిస్తోంది, ఆ నీటి ఒడ్డున ఆడుకుంటూ , లీలా మోహన్ కృష్ణ, సురేష్ వర్షానికి నానిపోయిన మట్టి మీద నుండి నదిలోకి జారిపోయి మునిగిపోయారని.. ఊరంతా బాధలో మునిగిపోయింది, ఆరేళ్ళ పిల్లల్ని పాడు వర్షం మింగేసిందని అంతా తిట్టుకున్నారు.. బాధ అంటే తెలియని వయసైనా, అందరి బాధకీ కారణం ఈ వర్షమే అని తెలిసి వర్షం నచ్చడం మానేసింది.

కొన్నేళ్ళ తర్వాత.. వీధి చివర ఒక తాత ఆరుగాలం చూసి చూసి వర్షం పడట్లేదని, పంట పండట్లేదని.. అప్పులు ఎలా తీర్చాలో తెలియక, పంట కోసం తెచ్చిన పురుగుల మందు తానే తాగాడని తెలిసి ప్రాణం నీరైపోయింది.. ఎలాగోలా ప్రాణం నిలిచింది! వర్షమే దీనికి కూడా కారణం అనిపించింది. ఎప్పటిదాకా అంటే, ఆ తర్వాత సంవత్సరం అందరికంటే ఎక్కువ దిగుబడి ఆ తాతకే వచ్చిందని తెలిసేదాక!! అప్పుడు అర్థమైంది, రైతు కన్నీటి చారికల్ని కడుగుతూ, గుండె లోతుల్ని తడుముతూ... బీటలు వారిన మట్టి పెళ్ళల్ని తడుపుతూ ఆకాశ లోయలోంచి భూమిలోతుకి ప్రవహించే అమృతం ఈ వర్షమని...

అకస్మాత్తుగా ఆలోచనలు ఆగిపోయాయి, తలెత్తి చూస్తే... వర్షం వెలిసిపోయింది! వర్షం అద్దిన కాంతి రేకుల జ్ఞాపకాలతో నా ముఖం మాత్రం వెలుగుతూనే ఉంది.

*– చంద్రిక,పరిశోధక విద్యార్థి,ఆంగ్లశాఖ,అక్కు.*

## గానం



*గానం హృదయ మధురం*
*శ్రవణాలకు వినోదం*
*శిశువు పరవశించి*
*ఆనందంగా నిదురించే*
*తల్లి అమృత గానం*
*సెలయేళ్ల సవ్వడుల*
*ప్రకృతితో పరవశించి*
*పక్షుల కేరింతలు*
*గిరి శిఖరాల నుండి*
*జాలువారు నీటి శబ్దాల*
*మృదంగ నాదగాన లయలు*
*పురివిప్పి నాట్యం చేసే మయూరాలు*
*మృదు మధురానుభూతులు*
*శిలలను రాగంతో*
*కరిగించిన హృదయం*
*అద్భుత గానంతో*
*అంబరాన వెలిసిన*
*మేఘుడు మురిసిపోయి*
*మురిపించిన ముత్యపు జల్లులు.లేత*
*చిగుర్లు ఆరగించి*
*కమ్మని కంఠంతో...*
*కూనిరాగాలు తీసిన కోయిలలు*
*చినుకుల సవ్వడికి*
*భూమాత చిగురించిన*
*పచ్చని చీర కట్టిన ప్రకృతి*
*నాదస్వరం వినికిడికి*
*సర్ప రాజుల సయ్యాటలు*
*మురళీ గానంతో*
*మురిసిపోయిన గోపికల*
*హృదయ విహారం*
*శిశుర్వేత్తి..పశుర్వేత్తి*
*సంగీతానికి సమస్త సృష్టి*
*లయబద్ధమైనదే జీవితం కదా!!*

*– డా.టి.పార్థసారథి,*
*కొయ్యలగూడెం*

## మట్టి పరిమళం

*ప్రచండ భానుని ప్రతాపానికి భూమి అగ్నిగుండమై,భస్మమై పోతుందా అన్న భయం!*
*విలవిలలాడారు ఎండల తీవ్ర వేడిమికి, వడగాడ్పులకు,*
*రుగ్మతలకు బ్రతుకులు ఎన్నో వాడి పాడెలెక్కాయి!*
*మనిషి మనుగడ కడగండ్ల పాలవుతోంది*
*కాలుష్యంతో ఉష్ణోగ్రత పెరిగి!*
*పర్యావరణ భద్రత ప్రాణికి బ్రతుకు నిస్తుంది.*
*ప్రకృతి కోపం ప్రకోపిస్తే బ్రతుకులు వికృతం అవుతాయి!*
*నిమిషంలో ప్రమోదాన్ని పంచగలదు ప్రళయాన్ని సృష్టించగలదు!*
*నిలువలేదు ఏ శక్తి ప్రకృతి ముందు*
*ప్రకృతి సహజంగా పొందే చల్లదనం ఎన్ని ఏ.సి.లు ఇవ్వగలవు?*
*తొలకరి జల్లుకు తడిసిన మట్టి పరిమళం ఎన్ని సుగంధాలు అందించగలవు?*
*వర్షానికి ప్రతీప్రాణి హర్షంతో పులకిస్తుంది*
*సేద్యకాని కళ్ళల్లో కొత్త ఆశలు మోసులెత్తుతాయి!*
*సక్రమంగా సాగితే రుతువులు గతితప్పక / ప్ర వర్ధిల్లుతాయి బ్రతుకులు సంభ్రమంగా!*
*ఉద్యమిస్తే కాలుష్య భూతాన్ని తరిమి వేయడమే విధిగా,*
*విశిష్టమైన జీవితం విరాజిత మౌతుంది*
*ప్రకృతిని ప్రేమిస్తే అమృత ఫలం దక్కుతుంది!*

*– మల్లెమొగ్గల గోపాలరావు.*

## వైద్యోనారాయణోహరి



*జనన,మరణపోరాటంలో వైద్యులు.*
*పగలనక రేయనక సేవకు నడుంకట్టి...*
*రోగి రక్షణకు శ్రీకారం చుట్టి...*
*మదర్ తెరిసా బాట పట్టిన ధన్వంతరి వారసులు.*
*ఆసుపత్రిని ఆదర్శ ఆలయంగా*
*వెలిగించేవారే వైద్యనారాయణులు.*
*తన సెత స్కోపునే మంత్రదండంగా మార్చి*
*చేతి నాడి పట్టి.. రోగం పసిగట్టి..*
*జబ్బు మాయం చేసే మాంత్రికుడు!*
*కరోనా సమయాన అవిశ్రాంత పోరాటయోధులు,*
*త్యాగధనులు.ఓర్పుతో సేవలందించే*
*శ్వేత శాంతి కపోతాలు.*
*పాశంవిసిరే యముణ్ణీ ఎదురొడ్డి కాపాడే*
*ప్రాణ రక్షకుడు.*
*మేమున్నామని భరోసా ఇచ్చే అభయ హస్తం.*
*కాబట్టే వైద్యో నారాయణోహరి:*

*– ఎస్.శ్రుతి బి.ఎస్సి.ప్రకాశం డిగ్రీ కళాశాల.*

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in